క్లుప్తంగా

21, 22వ తేదీల్లో విజయవాడలో రైతు సదస్సు

మార్టూరు: రైతాంగ సమస్యలపై ఈనెల 21, 22వ తేదీల్లో విజయవాడలో నిర్వహించనున్న జాతీయ రైతు సదస్సును జయప్రదం చేయాలని మండల రైతు సంఘం అధ్యక్షుడు వీరవల్లి కృష్ణమూర్తి శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 10.30 గంటలకు విజయవాడలోని మాకినేని బసవ పున్నయ్య భవన్‌లో ప్రారంభం కానున్న రైతు సదస్సులో రైతు సంఘం రాష్ట్ర, జాతీయ నాయకులు వ్యవసాయ రంగ సమస్యలు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంబంధాలు తదితర అంశాలపై చర్చించనున్నట్లు కృష్ణమూర్తి తెలిపారు. మండలంలోని రైతులు పెద్ద సంఖ్యలో సదస్సుకు హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు.

23న మండల సర్వసభ్య సమావేశం

పర్చూరు (చినగంజాం): పర్చూరు మండల సర్వసభ్య సమావేశం ఈనెల 23 వతేదీ బుధవారం ఉదయం 10 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మేకా ఆనందకుమారి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వీ ప్రద్యుమ్నకుమార్ తెలిపారు. సమావేశానికి ఎంపీటీసీలు, జెడ్పీటీసీ, గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

నేటి నుంచి మాలధారులకు అన్నదాన వితరణ

మేదరమెట్ల: కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల గ్రామం పాత గుంటూరు రోడ్డులో గల గణపతి మురగన్ అయప్ప సేవా సమితి ఆధ్వర్యంలో అయ్యప్పమాల ధారణ చేసిన స్వాములకు ఈనెల 20వ తేదీ నుంచి నవంబర్ 2వ తేదీ వరకు 44 రోజుల పాటు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని సేవా సమితి నిర్వాహకులు తెలిపారు. భవానీ, శివ, గోవిందమాల ధరించిన స్వాములకు కూడా అన్నదాన కార్యక్రమం ఉంటుందని, స్వాములు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సేవాసమితి సభ్యులు తెలిపారు.

నలుగురు జూదరుల అరెస్టు

అద్దంకి రూరల్: అద్దంకి సమీపంలోని గుండ్లకమ్మ నది ప్రాంతంలో పేకాట ఆడుతున్న నలుగురిని ఎస్సై ఖాదర్‌బాషా అదుపులోకి తీసుకున్నారు. అందిన సమాచారం మేరకు శనివారం రాత్రి ఎస్సై సిబ్బందితో కలిసి పేకాట శిబిరంపై దాడి చేసి వారినుంచి రూ. 5240 నగదు స్వాధీనం చేసుకున్నారు.

దివ్యాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ



దివ్యాంగులకు ట్రై సైకిళ్లు అందిస్తున్న దాతలు

చీరాల: చీరాలకు చెందిన నిరుపేద దివ్యాంగులకు దాతలు ట్రై సైకిళ్లు అందించారు. లెట్స్ హెల్ప్ ఆర్గనైజేషన్ చీరాల ఆధ్వర్యంలో ఎన్ఆర్ఐ రామిశెట్టి దిలీప్ కుమార్ అనూష దంపతుల సహకారంతో శనివారం పంపిణీ చేశారు. వడ్డె సంఘానికి చెందిన చిరంజీవి, పాతచీరాలకు చెందిన కొండారెడ్డి అనే ఇద్దరు దివ్యాంగులు పడుతున్న ఇబ్బందులను గుర్తించి సంస్థ ప్రతినిధి కనపర్తి కిరణ్‌కుమార్ చేతుల మీదగా అందించారు. కార్యక్రమంలో డేవిడ్, దయాకర్, శివపూర్ణ, నిస్సి, జయపాల్, సురేష్, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.



గతేడాది ప్రతిభా అవార్డులు అందుకున్న విద్యార్థులు (ఫైల్)

ప్రతిభకు.. ప్రోత్సాహమేది.. ?

- ప్రభుత్వ పాఠశాలను గాలికొదిలేసిన వైనం
- గత ప్రభుత్వంలో పది, ఇంటర్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు
- రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గస్థాయిలో బహుమతులు
- ఈ ఏడాది ఇవ్వని కూటమి ప్రభుత్వం
- విస్మయం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు

వేటపాలెం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలు గడుస్తున్నా ఎక్కడా కూడా అభివృద్ధి పనులు కాని.. ఇచ్చిన వాగ్దానాలు కాని అమలు చేయలేదు. కాని ప్రతిపక్షాల మీద మాత్రం ప్రతీకార దాడులతో రెచ్చిపోతోంది. రాష్ట్రమంతా హత్యలు, హత్యాచారాలు, దాడులు నిత్యం ఏదో ఒక చోట జరుగుతూనే ఉన్నాయి. ఈ ఐదు నెలల్లో విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలను పూర్తిగా విస్మరించింది. తల్లికి వందనం అమలు చేయకుండా నాన్నకు ఇంధనం మాత్రం అమలు చేశారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో విద్య, వైద్యం, వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇచ్చి ఒక వెలుగువెలిగేలా చేసింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో నాణ్యమైన మద్యం వీధివీధినా దొరుకుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ప్రతి పేద, మధ్య తరగతి విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం నాడు–నేడు పథకం కింద పాఠశాల రూపరేఖలను మార్చివేసింది. అమ్మఒడి పథకం ద్వారా రూ.15 వేలు విద్యార్థుల తల్లిదండ్రుల బ్యాంకు ఖాతాల్లో నగదు అందజేశారు. అంతే కాకుండా ప్రభుత్వ బడులలో చదువుకుని పదోతరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్ష ఫలితాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను ప్రోత్సాహించేందుకు జగన్న ఆణిముత్యాలు పేరిట నగదు ప్రోత్సాహక బహుమతులను అందించి సత్కరించింది. అయితే ప్రస్తుతం అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం విద్యార్థులను ప్రోత్సాహించడానికి ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో గత విద్యా సంవత్సరం ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు లేనట్టేనని పలువురు ఉపాధ్యాయులు అభిప్రాయపడుతున్నారు.

వివిధ స్థాయిలో ప్రోత్సాహకాలు..

ప్రభుత్వ పాఠశలల్లో, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఫలితాలను మెరుగుపరిచి వారిని ప్రోత్సాహించే విధంగా గత ప్రభుత్వంలో ప్రోత్సాహక బహుమతులు అందించారు. పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను రాష్ట్ర స్థాయి, జిల్లాస్థాయి, నియోజకవర్గస్థాయిల వారీగా ఎంపిక చేసి నగదు బహుమతులు అందించారు. పదో తరగతితో పాటు ఇంటర్మీడియట్‌లో ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, సీఈసీ, ఎంఈసీ వంటి గ్రూపుల వారీగా అత్యధిక మార్కులను సాధించిన వారికి ఎంపిక చేసి ప్రోత్సాహకాలను అందించారు. పదోతరగతిలో రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానం సాధించిన వారికి రూ.1 లక్ష, రెండో స్థానానికి రూ. 75 వేలు, మూడో స్థానం సాధించిన వారికి రూ. 50 వేలు అందించారు. ఇంటర్మీడియెట్‌లో గ్రూపులకు ఒక్కరు చొప్పున ప్రతిభ చాటిన వారికి రూ.1 లక్ష అందించారు. జిల్లా స్థాయిలో అయితే పదో తరగతిలో మొదటి స్థానం నిలిచిన వారికి రూ. 50 వేలు, రెండో స్థానంలో రూ. 30 వేలు, మూడో స్థానంలో నిలిచిన వారికి రూ.15 వేలు ఇచ్చారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఒక్కరు చొప్పను ప్రతిభ చాటిన వారికి ఒక్కొక్కరికి రూ. 50 వేలు అందించి ప్రోత్సాహించారు. అలాగే నియోజకవర్గస్థాయిలో పదో తరగతిలో మొదటి మూడు స్థానాల్లో రూ. 15 వేలు, రూ. 10 వేలు, రూ. 5 వేలు, ఇంటర్‌లో టాపర్‌గా నిలిచిన విద్యార్థులకు రూ. 15 వేలు ప్రోత్సాహకంగా గత ప్రభుత్వం అందించి సత్కరించింది.

ఈ ఏడాది ప్రోత్సాహకాలు లేనట్టే..

ప్రస్తుతం అధికార చేపట్టిన కూటమి ప్రభుత్వం విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందించడానికి ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయాలను తీసుకోవడం లేదు గనుక ప్రస్తుతం ప్రోత్సాహక బహుమతులు లేనట్టేనని ఉపాధ్యాయులు అభిప్రాయపడుతున్నారు. గతేడాదిలో చీరాల నియోజకవర్గ పరిధిలో ఆణిముత్యాల కింద పదో తరగతిలో ముగ్గురు, ఇంటర్మీడియెట్‌లో నలుగురు విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించారు.

విద్యార్థినులను కన్నబిడ్డల్లా చూసుకోవాలి



విద్యార్థినుల వద్ద వివరాలు సేకరిస్తున్న న్యాయమూర్తి సుధ

చీరాల రూరల్: విద్యార్థినిలను శ్రద్ధగా చదివించడమే కాకుండా వారిని కన్నబిడ్డల్లా చూసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి ఎం. సుధ అన్నారు. శనివారం పట్టణంలోని కస్తూరిబా గాంధీ మున్సిపల్ బాలికోన్నత పాఠశాలను మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి ఎం. సుధ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి పాఠశాలలోని మధ్యాహ్న భోజన పథకం అమలు తీరుతెన్నులను పరిశీలించారు. భోజన పథకానికి సంబంధించిన సిబ్బందిని, పాఠశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినిలను విడివిడిగా సమాచారం అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులకు భోజన సదుపాయాలు సక్రమంగా చూస్తున్నారా లేదా అనే విషయాలను విద్యార్థినిలను అడిగి తెలుసుకున్నారు. బోధన విషయాల్లో జాగ్రత్తగా ఉండాలని ఉపాధ్యాయులకు సూచించారు. మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన వంట గదులను పరిశీలించారు. విద్యార్థినిల హాజరు శాతం పరిశీలించారు. పాఠశాలలోని రికార్డులను న్యాయమూర్తి తనిఖీ చేశారు. ఉన్నత న్యాయ స్థానాల ఆదేశాల మేరకు తనిఖీలు చేసినట్లు న్యాయమూర్తి పేర్కొన్నారు. పాఠశాలలో పరిశీలించిన విషయాలను ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు న్యాయమూర్తి తెలిపారు. న్యాయమూర్తి వెంట పారా లీగల్ వలంటీర్లు ఎస్‌డీ మతిన్, ఎంఎస్. సుభాని, ఎం. రామారావు ఉన్నారు.

ఇస్తినమ్మ వాయనం.. పుచ్చుకుంటినమ్మ వాయనం



వేటపాలెంలో ఉయ్యాల ఊగుతున్న చిన్నారి

వేటపాలెం: ఇస్తినమ్మ వాయనం.. పుచ్చుకుంటినమ్మ వాయనం అంటూ నూతనంగా పెళ్లైన యువతులు ముత్తైదువులకు అట్లతద్ది వాయనాలు ఇచ్చిపుచ్చుకున్నారు. శనివారం మండలం పరిధిలోని గ్రామాల్లో మహిళలు అట్లతద్ది పండుగ పర్వదినాన్ని జరుపుకున్నారు. కొత్తగా పెళ్లైన మహిళలు ఉదయాన్నే లేచి గౌరీదేవికి నిష్ఠతో ఉపవాసాలు ఉండి నోములు నోచుకున్నారు. సాయంకాలం ఇంటి చుట్టు పక్కల పది మంది ముత్తైదువులు, పోతురాజుగా ఒకరు ఉండి గౌరిదేవి వ్రతాలు నోచుకున్నారు. అనంతరం అట్లు, పిండి వంటలు, కొత్త బట్టలు, ముత్తైదువులకు ఇచ్చి ఇస్తినమ్మ వాయనం .. పుచ్చు కుంటినమ్మ వాయనం అంటు ఒకరికొకరు వాయనాలు అందుకున్నారు. అనంతం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఉయ్యాలల్లో మహిళలు ఉత్సాహంగా ఊగారు. అట్లతద్ది రోజు పెళ్లికాని యువతులు ఉపవాసాలు ఉంచి గౌరీ దేవి వ్రతాలు ఆచరిస్తే మంచి భర్త లభిస్తారని నమ్మకం.

పాఠశాలల్లో అట్లతద్ది..

బల్లికురవ: అట్లతదియ వేడుకలు మండలంలోని అన్ని గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. కన్నె పడుచులు, ముత్తైదువలు. కొత్తగా పెళ్లయిన ఆడపిల్లలు వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. పాఠశాలల్లో బాలికల కోసం ఆటవిడుపుగా ఉపాధ్యాయులు చెట్లకు ఉయ్యాల ఏర్పాటు ఆనందపరిచారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో..

అద్దంకి రూరల్: రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో శనివారం అట్లతద్ది పండగను ఘనంగా జరుపుకున్నారు. స్థానిక హరిహర గోశాలలో తాటి మానులతో పెద్ద ఉయ్యాల వేశారు. చిన్నారులు, పెద్దలు అధిక సంఖ్యలో అక్కడికి వచ్చి ఉయ్యాల ఊగి ఉత్సాహంగా గడిపారు. ఈసందర్భంగా పెద్దలు పండగ విశిష్టతను గురించి వివరించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, కార్యదర్శి మురళీ సుధాకరరావు, ట్రెజరరల్ మలాది శ్రీనివాసరావు, క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ మహమ్మద్ రఫీ, గోశాల నిర్వాహకుడు గోనుగుండ్ల సుబ్బారావు, జాగర్లమూడి శివకుమారి, కొల్లా భువనేశ్వరీ, ఉటుకూరి నగరాజకుమారి, కాకర్ల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



వల్లాపల్లిలో ఆటవిడుపుగా చిన్నారులతో ఉయ్యాల ఊగిస్తున్న ఉపాధ్యాయుడు



అద్దంకిలో ఊయల ఊగుతున్న విద్యార్థిని

మానవ అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

చీరాల టౌన్: ప్రపంచ వ్యాప్తంగా జరగుతున్న మానవ అక్రమ రవాణాను అడ్డుకోవడం, అరికట్టడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతని చీరాల డీఎస్పీ జగదీష్ నాయక్ పిలుపునిచ్చారు. శనివారం మదర్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో వాక్ ఫర్ ఫ్రీడమ్ ర్యాలీని ఏర్పాటు చేయగా డీఎస్పీ హాజరై జెండా ఊపి ప్రారంభించారు. మదర్ సొసైటీ అధ్యక్షుడు నాగిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీ పట్టణంలోని పలు వీధుల్లో నుంచి రైల్వే స్టేషన్, బస్టాండ్ రోడ్డు, గడియార స్తంభం సెంటర్ నుంచి సాగింది. అనంతరం విద్యార్థులు, అధ్యాపకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలిసి మానవహారాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా ప్రస్తుతం దేశంలోని వివిధ రాష్ట్రాల్లో వేధిస్తుందన్నారు. మహిళలు, యువతులు, చిన్నారుల అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకుని ప్రజలను చైతన్యవంతం చేయాలన్నారు. కుటుంబ సభ్యులు, నివాస ప్రాంతాల్లో ఎవరైనా కనిపించకపోయిన వెంటనే 1098 లేదా 112 నంబర్లకు సమాచారం అందించాలన్నారు. దేశంలో 100కుపైగా దేశాల్లో వాక్ ఫర్ ఫ్రీడమ్ ర్యాలీ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వన్ టౌన్ సీఐ శ్రీనివాసరావు, చైతన్య భారతీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సోమేశ్వరరావు, ప్రతినిధులు రాంబాబు, సురేష్, కళాశాలలు, ప్రైవేటు స్కూళ్ల విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు దాసరి ఇమ్మానియేల్, సూర్యప్రకాంతిరాయ్, టి.పాపయ్య, కె.వెంకటరావు సిబ్బంది పాల్గొన్నారు.



వాక్ ఫర్ ఫ్రీడమ్ ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎస్పీ జగదీష్‌నాయక్

మధ్యాహ్న భోజనం పరిశీలన

అద్దంకి రూరల్: ఉన్నత న్యాయస్థానాల ఆదేశాల మేరకు అద్దంకి సీనియర్ సివిల్‌జడ్జి డి. నాగ వెంకటలక్ష్మీ శనివారం స్థానిక ప్రకాశం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. దీనిలో భాగంగా వంటగది, స్టోర్ రూమ్ పరిశీలించి తగు సూచనలు చేశారు. ఇతర సౌకర్యాలను గురించి హెచ్ఎం డీ పద్మావతిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ రమేష్‌బాబు, ఉచిత న్యాయ సహాయ న్యాయవాదులు షేక్ మహమ్మద్ రఫీ, ఎం. ప్రకాష్ పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి

రేపు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడి ప్రమాణ స్వీకారం

పర్చూరు (చినగంజాం): వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడిగా మేరుగ నాగార్జున ఈ నెల 21 ఉదయం 10 గంటలకు బాపట్ల ఎంఎస్ఆర్ కల్యాణ మండపంలో ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు పార్టీ సీనియర్ నాయకులు గాజుల రమేష్, మాచవరపు రవి కుమార్, కట్టా రత్నరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రమాణ స్వీకారానికి వైఎస్సార్ సీపీ అభిమానులు, కార్యకర్తలు వేలాదిగా కార్యక్రమానికి రావాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమానికి అందరూ హాజరై జయప్రదం చేయాలని వారు కోరారు.

రైతులకు పెట్టుబడి సాయం ఎక్కడా ?

జే.పంగులూరు: అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ప్రతి రైతుకు రూ. 20 వేలు ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని రైతు సంఘం బాపట్ల జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు కోరారు. రైతులకు పెట్టుబడి సాయం ప్రస్తావన ప్రభుత్వం నుంచి ఈ సంవత్సరం ఇంతవరకు రాలేదని శనివారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల సమయంలో రైతుల ఓట్ల కోసం రైతులకు లేనిపోని ఆశలు కల్పించి కూటమి ప్రభుత్వం ఓట్లు దండుకున్నాడని, ఎన్నికలు అయిపోయిన తర్వాత ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం మరచి పోవడం సరైనది కాదన్నారు. గత నెల కురిచిన వర్షాలకు పంటలు మొత్తం దెబ్బతిని పోయాయని, లక్షలాది ఎకరాల్లో నష్టపోయిన రైతులకు పూర్తి స్థాయిలో నష్టపరిహారం ఇవ్వలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సాగర్ రెండో జోన్ కింద వరి సాగుకు పూర్తిస్థాయిలో సాగునీరు ఇవ్వాలని కోరారు.





8 ఏళ్ల ముందు పచ్చదనంతో ఉన్న పార్కు (ఫైల్)

బాలల పార్కు కేరాఫ్ చిట్టడవి

- దాతల దాతృత్వం నిరుపయోగం
- గ్రామం మధ్యన నిరుపయోగంగా ఉన్న పార్కు
- పూర్వ వైభవం తేవాలంటున్న ప్రజలు

వేటపాలెం: అధికారులు, ప్రజానిధుల నిర్లక్ష్యం కారణంగా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు సాగడం లేదు. రైల్వే స్టేషన్ రోడ్డులో పోలీస్ స్టేషన్ ముందు 67 ఏళ్ల చరిత్ర ఉన్న బాలల పార్కును అధికారులు, పాలకుల నిర్లక్ష్యం కారణంగా మసకబారింది. పార్కు ముందు ప్రహరీ పడగొట్టి దాదాపు 8 ఏళ్లుగా నిరుపయోగంగా ఉంచారు. 1957లో స్టేషన్ రోడ్డులో గ్రామం మధ్యలో దాతలు దాదాపు 40 సెంట్ల స్థలాన్ని బాలల పార్కు కోసం స్థలాన్ని పంచాయతీకి అప్పగించారు. అప్పటిలో పార్కులో బాలలు ఆడు కోవడానికి జారుడు బల్లలు, ఊయల వంటివి ఉండేవి. వీటితో పాటు టీవీలు రాక ముందు పార్కులో రేడియో ఏర్పాటు చేసి సాయంకాలం వేళలో ఆలిండియా రేడియో కార్యక్రమాలు వినిపించేవారు. విశ్రాంత ఉద్యోగులు, వృద్ధులు, చిన్నారులు సాయంకాలం పార్కుకు వచ్చి రేడియో కార్యక్రమాలు వింటూ కాలక్షేపం చేసేవారు. చిన్నారులు పాఠశాలల నుంచి రాగానే పార్కులోనే ఆటలాడుకొనేవారు. అయితే ప్రస్తుతం 8 ఏళ్ల నుంచి పార్కు పరిస్థితి అధ్వానంగా తయారైంది.

పార్కు ప్రధాన గోడ కూల్చివేత..

డ్రైనేజీ నిర్మాణం పేరుతో దాదాపు 6 ఏళ్ల కిందట కాంట్రాక్టర్ పార్కు ముందు వైపు గోడ కూల్చేశాడు. ఆతరువాత డ్రైనేజీ నిర్మాణం నిలిచిపోయింది. పార్కు గోడ కూల్చి వేయడంతో పార్కులో పెంచిన మొక్కలకు రక్షణ లేదు. పంచాయతీ అధికారులు పార్కు ఆలనాపాలన పట్టించుకోలేదు. గ్రామ పంచాయతీ ఎన్నికలు ఐదేళ్ల నుంచి లేకపోవడంతో ప్రజాప్రతినిధులు లేరు. ఉన్న అధికారులు కాలం వెళ్ల దీసుకొని వెళ్లిపోవడమే తప్ప పార్కు బాగుకు ఎటువంటి ప్రయత్న చేసిన దాఖలాలు లేవు. ప్రస్తుతం పార్కు స్థలం ఖాళీగా ఉండంతో పార్కు ముందు ఉన్న పోలీసేలు పట్టుకున్న ఇసుక ట్రాక్టర్‌లు, రోడ్డు ప్రమాదాలకు గురైన వాహనాలను ఈస్థలంలో ఉంచుతున్నారు. పార్కు పాత సామన్ల గోదాములుగా మారింది.



ప్రస్తుతం పార్కు ముందు ఇసుక ట్రాక్టర్లు కార్లు నిలిపి ఉంచిన వైనం

అడుగడుగునా అధికారుల నిర్లక్ష్యమే..

వేటపాలెం గ్రామ పంచాయతీకి ఐదేళ్లగా ఎన్నికలు జరగలేదు. అప్పటి నుంచి ప్రత్యేక అధికారులు, కార్యదర్శుల పాలనలోనే ఇప్పటివరకు గ్రామ పరిపాలన జరుగుతోంది. ఐదేళ్లలో ఐదుగురు కార్యదర్శులు మారిపోయారు. నలుగురు ప్రత్యేక అధికారులు మారిపోయారు. ఏ అధికారికి బాలల పార్కు బాగు చేయాలన్న ఆలోచనే లేకుండా పోయింది. గతంలో ఎంపీడీఓగా పని చేసిన ఒక అధికారి దాతలు అందించిన పార్కు స్థలంలో ఏకంగా గ్రామ సచివాలయం నిర్మించాలని సిఫార్సు చేశాడు. ఇది తెలుసుకున్న దాతల తాలుకు వారసులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. తమ పెద్దలు బాలల పార్కుకోసం ఇచ్చిన స్థలంలో గ్రామ సచివాలయం నిర్మాణం చేయరాదని అభ్యంతరం పెట్టారు. దీనితో అది ఆగిపోయింది. అయితే గ్రామానికి వచ్చిన ఏ అధికారి పార్కును బాగు చేయాలనే ఆలోచనే లేకుండా పోయింది. ఇకపోతే ప్రజా ప్రతినిధులు పార్కు సంగతి మరచిపోయారు. అయితే వృద్ధులు మాత్రం పార్కు బాగు చేస్తే సాయంకాలం కాసింత విశ్రాంతిగా కూర్చోడానికి వీలుంటుందని స్థానికులు కోరుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు పార్కు బాగుచేయడానికి కృషిచేయాలని కోరుతున్నారు.

ప్రమాదకరంగా చప్టా



ప్రమాదభరితంగా ఉన్న చప్టా

జే.పంగులూరు: మండలంలోని పమిడిపాడు మేజర్ కాలువపై చప్టాలు ప్రమాద భరితంగా మారాయి. చప్టాలకు ఇరువైపుల రక్షణ గోడలు లేకపోవటంతో వాహన దారులు అటుగా వెళ్లాలంటే ఇబ్బంది పడే పరిస్థితి ఏర్పండింది. సంబంధిత అధికారులు స్పందించి సాగర్ కాలుపై ఉన్న చప్టాలను అధునికీకరించి, ఇరువైపుల రక్షణ గోడను ఏర్పాటు చేయాలని వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

చీరాల డివిజన్
90101 55593 (చీరాల)

Office mail : sakshiongads@gmail.com